క్లుప్తంగా

ఎడ్లబండ్ల గిరక పోటీలు



ఆత్మకూర్: ఎద్దులబండ్ల గిరక పోటీలు మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో వైభవంగా నిర్వహించారు. గిరక పోటీల్లో 16 జతలు పాల్గొనగా అత్యంత ప్రతిభ కనబర్చిన ఎడ్లజత రైతుకు మాజీ సర్పంచ్ విజయలక్ష్మి నగదు బహుమతి అందజేశారు. అంతకు ముందు గ్రామంలో మేళతాలాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, శివవానందరెడ్డి, రాములు, మాసన్న, ఖాజన్న, హరీష్‌గౌడ్, న్యాయవాది అశోక్‌గౌడ్, అశోక్‌నంద, సుధాకర్‌రెడ్డి, రాంచంద్రి, రైతులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అమరచింత: ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఎద్దుల బండి గిరక లాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు షీల్డ్‌ను అందించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన గొల్ల రామకృష్ణకు చెందిన ఎద్దులు మొదటి బహుమతిని కైవసం చేసుకోవడంతో రూ.12 వేల నగదును బీజేపీ సీనియర్ నాయకుడు మేర్వరాజు అందించారు. నాల్గవ బహుమతి రాజారెడ్డికి చెందిన ఎద్దులు గెలుపొందగా రూ.5 వేలు క్యామ భాస్కర్ అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ, విజయ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత రేమద్దులతండా



పాన్‌గల్: మండలంలోని అన్నారం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా రేమద్దులతండా జట్టు, రన్నర్‌గా అన్నారంతండా జట్టు నిలిచాయి. జట్లకు ఆదివారం నిర్వాహకులు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. విజేత జట్టుకు రూ.10 వేల నగదు, రన్నర్ జట్టుకు రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేష్ నాయుడు, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేష్, శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగంపేటలో తాగునీటి ఇబ్బందులు



అమరచింత: మండలంలోని సింగంపేటలో మూడు రోజుల నుంచి తాగునీటి ఇబ్బందులు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నీరులేక దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నిత్యం కుళాయిల ద్వారా ఇంటింటికి తాగునీరు అందించే వారని ప్రస్తుతం కుళాయిలకు నీటి సరఫరా నిలిచిందని పేర్కొన్నారు. ఎర్రగట్టు వద్ద పైప్ లైన్ లీకేజీ వల్ల తాగునీరు రావడం లేదని మిషన్ భగీరథ సిబ్బంది పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి మీదుగా ఆత్మకూర్ వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఆత్మకూర్ వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మధ్యాహ్న సమయంలో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు సత్వరమే స్పందించి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.



ఖిల్లాఘనపురంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పండితుడు



అమరచింతలో పంచాంగం చదివి వినిపిస్తున్న పురోహితుడు శివానంద్

ఊరూరా ఉగాది సంబరాలు

- గట్టుకాడిపల్లిలో వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ
- ఖిల్లాఘనపురంలో ఎద్దులబండ్ల ఊరేగింపు
- ఆలయాలలో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం చెప్పిన పురోహితులు

సాక్షి, నెట్‌వర్క్: ఖిల్లాఘనపురం మండలంలో ఆదివారం ఉగాది పండుగ ప్రజలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. తెలుగు సంవత్సరం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం(ఉగాది) సందర్భంగా గ్రామాల్లో ఉదయం నుంచి సందడి నెలకొంది. ఇంటి దేవతలకు నైవేద్యం సమర్పించి, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గట్టుకాడిపల్లిలో వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఖిల్లాఘనపురం కుమ్మరి గేరి ఆంజనేయస్వామి, మల్కిమియాన్‌పల్లి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఎద్దులబండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు నిర్వహించారు. ఖిల్లాఘనపురం, అప్పారెడ్డిపల్లిలో గ్రామ మాజీ సర్పంచ్ అనెమోని కృష్ణవేణితో పాటు పలు గ్రామాల్లో పండుగ సందర్భంగా దేవాలయాల దగ్గర ప్రత్యేకంగా షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. రైతులు తెలుగు సంవత్సరాది సందర్భంగా కాడెద్దులకు చెరువుల్లో ఈత కొట్టించి కుటుంబ సభ్యులతో పాటుగా బక్షాలు పెట్టి పూజలు చేశారు. పొలాల్లో వ్యవసాయ పనులకు పూజలు చేసి ప్రారంభించారు. ఖిల్లాఘనపురం గోపాలస్వామి దేవాలయం, గట్టుకాడిపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటుగా పలుగ్రామాల్లో పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో వ్యవసాయం, వర్షాలు, పంటలు తదితర వాటి పరిస్థితి ఎలా ఉంటుందో పండితులు వివరించారు. తెలుగు సంవత్సరం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలు, గిరిజన తండాల్లో సంబరాలు చేసుకున్నారు.

- పాన్‌గల్ మండలంలో పండుగ సందర్భంగా ఇంటి ముంగిళ్లను పచ్చని మామిడి ఆకుల తోరణాలతో, పూలతో అందంగా అలంకరించారు. రోగ నిరోధక శక్తి పెంచే ఉగాది పచ్చడి షడ్రుచులను అన్ని వర్గాల ప్రజలు పంచిపెట్టారు.
- అమరచింత మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయ ఆలయ ఆవరణలో పంచాంగ కట్ట వద్ద పురోహితుడు శివానంద్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.
- వనపర్తి మండలంలోని పెద్దగూడెంలోని శ్రీ కోదండరాముడి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం వేద పండితులు రమణశర్మ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.
- కొత్తకోట, పెద్దమందడి మండలాల్లో ప్రజలు ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్తకోట పట్టణంలోని రామాలయంలో వేదపండితులు పంచాంగం చదివి వినిపించారు. రాయిణిపేటలో ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది రైతులు ఎద్దుల బండ్లతో, ట్రాక్టర్లతో పురవీధుల్లో ర్యాలీ చేశారు.

– ఆత్మకూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోపంచాంగ శ్రవణం పండితులు చెప్పారు.
– మదనాపురం మండల కేంద్రంతో పాటు దంతనూర్, అజ్జకొల్లు, కొన్నూర్, నెల్విడి, నర్సింగాపూర్, కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.



ఖిల్లాఘనపురంలో కుమ్మరిగేరి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గరకు ఎద్దుల బండ్ల ఊరేగింపు



అప్పారెడ్డిపల్లిలో ఉగాది పచ్చడి ప్రజలకు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు



రాయిణిపేటలో ఎద్దుల బండ్లు,ట్రాక్టర్లతో ఊరేగింపు చేస్తున్న రైతులు



ఖిల్లాఘనపురం గట్టుకాడిపల్లిలో వేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



పెద్దగూడెంలో పంచాంగ శ్రవణంలో వేద పండితులు



ఆత్మకూర్‌లో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పండితులు

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



ఖిల్లాఘనపురం: సమాజంలో ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు సామ్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్లకృష్ణయ్య, సింగల్‌విండో వైస్‌చైర్మన్ క్యామరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర ఖిల్లా ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభోత్సవానికి హాజరైన వారు మాట్లాడుతూ ఖిల్లా ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గడిచిన 16 ఏళ్లుగా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి బస్టాండ్‌లో ప్రయాణికులకు, మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం జరుగుతుందన్నారు. ఖిల్లా ఫ్రెండ్స్ సభ్యులు బండారు కృష్ణయ్య పూర్తి బాధ్యతలు తీసుకుని చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బండారి కృష్ణయ్య, భూమయ్య, క్యామ వెంకటేష్, విక్రం, క్యామ బాల్‌రాజు, రాఘవేందర్‌రెడ్డి, చిన్న ఆంజనేయులుగౌడు, పాలవాది లక్ష్మీనారాయణ, పెద్ద ఆంజనేయులుగౌడు, శ్రీనువాసులు, మునగాల బాబు, సింగోటం, రాజిరెడ్డి, సృజన్‌కుమార్, రామకృష్ణ, కేశవరెడ్డి, బుచ్చన్న పాల్గొన్నారు.

ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 29 రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఆదివారం రాత్రి స్థానిక మస్‌జిదే నూర్‌లో చాయపత్త బాబుమియ ఆధ్వర్యంలో, మస్జిదే సయ్యదియాలో దివంగత బీఆర్ఎస్ నాయకుడు ముఖీద్ కుమారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానాలు అబ్దుల్ అలీంరశాది, హఫీజ్ అజ్హర్ ఆధ్వర్యంలో ప్రపంచశాంతిని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మునీర్, రియాజ్‌అలీ, అజ్హర్, అశ్రఫ్, రజాక్, నవీద్, తౌఫీఖ్, సాబీర్, సలీం, ఖాదర్, తఖీ, అఫ్రోజ్, సుఫీయాన్, జీయా ఉర్ రహ్మాన్, జహంగీర్, ఆరీఫ్, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ పోటీలు



ఆరేపల్లిలో క్రికెట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో అల్లీపూర్ ఇండోర్ స్టేడియంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న షటిల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మొదటి బహుమతి సాధించిన విజేతలు క్యాంపు నరేందర్‌గౌడ్, రాజు, రెండో బహుమతి సాధించిన గట్టన్న, శివలకు నగదుతో పాటు షీల్డులను నిర్వాహకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను బహూకరించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరేపల్లిలో క్రికెట్ పోటీలు

ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లిలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు రూ.50 వేలు నగదుతో పాటు షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, మాజీ సర్పంచ్ అనసూయ, ప్రభాకర్‌రెడ్డి, రాంచంద్రయ్య, రాజేందర్‌గౌడ్, నాగన్న, ఆంజనేయులు, తిరుపతన్న, రాములు, దేవేంద్రం, వెంకటన్న, ఆనంద్, క్రీడాకారులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కొత్తపేటకు బస్సు సౌకర్యం కల్పించండి



కొత్తపేట గ్రామ బీటీ రోడ్డు

పాన్‌గల్: బీటీ రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిపిస్తామని ఒక పక్క పాలకులు, మరో పక్క అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఇచ్చిన హామీలు అమలు కాక గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొత్తపేట గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. మాందాపూర్ గ్రామం వరకు నడిచి వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి దృష్టికి, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ట్యాంకర్ ఎర్రవల్లిలో రోడ్డు దాటుతున్న కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ధ్వంసం కాగా అందులోని ఐదుగురు ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీంతో హైవేపై కొంత మేరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అలంపూర్ వ్యక్తి జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా సందెపురాళ్ల పోటీలు



గట్టు: మండల పరిధిలోని రాయాపురం గ్రామంలో ఆదివారం సందెరాళ్ల పోటీలను బీఆర్ఎస్ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులంతా కలసి కట్టుగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం గుట్టపైనున్న కంబరాయుడు ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేష్, కర్రెప్ప, నర్సింహులు, మొబ్బు తిమ్మప్ప, అమ్మన్న, బుడ్డ తిమ్మప్ప, కావలి నర్సింహులు, పూజారి తిమ్మారెడ్డి, గొకారప్ప తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



కొత్తకోట ఇఫ్తార్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ముస్లింలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇఫ్తార్‌కు జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డిలు హాజరై ముస్లింలతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం స్వీట్లు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి గాడీల ప్రశాంత్, చీర్ల నాగన్నసాగర్, అయ్యన్న, ఖాజా, తాహేర్, వహీద్, లాలు, సాజిద్, బాబా, ఎల్ఐసీ కృష్ణయ్యగౌడ్, శాంతిరాజు తదితరులు ఉన్నారు.

పునర్నిర్మించరూ.. మరమ్మతు చేయరూ



ఎక్లాస్‌పురం సమీపంలో కంకరతేలిన రోడ్డు

- శిథిలమైన బీటీ రోడ్డు
- ప్రమాదాలకు గురవతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

అయిజ: గట్టు– అయిజ మండలాల మధ్య నిర్మించిన బీటీరోడ్డు శిథిలావస్థకు చేరింది. నిత్యం వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి కంకర తేలి అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాల్లో కొందరు ఆస్పత్రిలో చికిత్స పొంది బతికి బట్టకట్టగా మరి కొందరు మృత్యువాత పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు రోడ్డును పునఃనిర్మించడం లేదు. కనీసం గుంతలను ఊడ్చి మరమ్మతు కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కంకరవేసి వదిలేశారు..

అయిజ నుంచి గట్టుకు ఏర్పాటు చేసిన రోడ్డు అనేక చోట్ల గుంతలు పడి అస్తవ్యస్తంగా మారింది. ప్యాచ్ వర్క్ చేసేందుకు గత సంవత్సరం అధికారులు పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టర్ కంకర పరిచి వదిలేశారు. దీంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. అదే విధంగా అయిజ నుంచి ఉప్పలకు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు బీటలు బారింది. గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నా కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. శిథిలమైన రోడ్లను పునః నిర్మించి, పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



గట్టు– అయిజ మండలాల మధ్య అనేక గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తుంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాలం చెల్లకముందే వాహనాల టైర్లు అరిగిపోతున్నాయి. గ్రామాలకు ఆటోలు రావడానికి డ్రైవర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. – దేవేంద్ర, ఎక్లాస్ పురం

అదుపుతప్పుతున్న వాహనాలు



మండలంలోని చాలా గ్రామాల్లో రోడ్లు శిథిలమయ్యాయి. గుంతలు పడడంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ప్రమాదాల్లో ఇప్పటికే అనేక మంది గాయపడ్డారు. కొంత మంది మృతి చెందారు. శిథిలమైన రోడ్లకు మరమ్మతు చేపడితేనే ప్రమాదాలను నివారించవచ్చు.

– దరెన్న, అయిజ

ప్రతిపాదనలు పంపాం

శిథిలమైన రోడ్లను పునఃనిర్మించేందుకు, అవసరమైన చోట ప్యాచ్ వర్క్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. అయిజ– గట్టు రోడ్డులో ఎక్లాస్పురం వద్ద ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాం. కొన్ని కారణాల వలన పనులు ఆలస్యమవుతున్నాయి. నిధులు మంజూరైన వెంటనే రోడ్లకు మరమ్మతు చేపడుతాం. – అల్తాఫ్, ఆర్‌అండ్‌బీ ఏఈ